# మనియార్డరు వచ్చింది!

కొమరవోలు నాగభూషణరావు***

"పోస్టుమాన్ - పోస్టు"

భోజనంచేసి వంటిల్లు కడుక్కుంటూ ఉన్న రుక్మిణమ్మకు ఆ కేక వినిపించగానే గబగబావచ్చి ముందరి వసారాలో నిల్చొని ఉత్తరాల కోసం చేయి జాపింది.

"రాఘవరావుగారున్నారా?"

"ఆఫీసుకు వెళ్ళారు."

"మనియార్డరు వచ్చింది. రేపు ఉదయం పోస్టాఫీసుకువచ్చి సంతకం చేసి తీసికొని వెళ్ళమని చెప్పండి"

మనియార్డరు మాట చెవినిబడగానే రుక్మిణమ్మ మనస్సులో ఉన్న బరువు తగ్గి సంతోషంతో నిండుకొన్నది. అప్పటికి రెండు నెలల నుంచి జీతం చాలక నానాయిబ్బందులు పడుతున్నారు. జంటనగరాల్లో అప్పర్ డివిజను గుమాస్తాకు ఆఫీసులో మినహాయింపులు పోగా వచ్చే నెల జీతంలో రు 80-లు ఇంటి అద్దె పోతుంది. ఏపూట కాపూట పాలకేంద్రంలోను, ఎప్పటి కప్పుడు రేషను షాపులోను తక్కిన దుకాణాలలోను నగదుచెల్లించి సరుకులు కూరగాయలు వగైరా తీసుకోవాలి. ధరలు చూడబోతే అందకుండా పైకిపోయి వెక్కిరిస్తున్నాయి. ఆలుమగలు - ఇద్దరు పిల్లలుగల సంసారం. వచ్చేది చాలక యితర ఆదాయమేమీలేక అతి కష్టంతో కాలప్రవాహంలో సంసార నౌకను ఈడ్చుకొని వస్తున్నారు. ఇట్లా ఉండగా ఒక రోజున పట్టలేక భర్తతో అన్నది.

"ఏమండీ! ఉగాది పండుగ వస్తున్నది. నాకు లేకపోతే మానె. పిల్లలకైనా చెరొక జతగుడ్డలు కుట్టించండి."

రాఘవరావు మాట్లాడలేదు. అతని మనసు కలచివేసి నట్లయింది. తన భార్య ఎన్నడూ పట్టు పెట్టదు. సామాన్యంగా నోరు తెరచి ఏదైనా కావాలని అడగదు. చెప్పకుండా డబ్బు ఖర్చు పెట్టదు. చాలా జాగ్రత్తగా వాడుతుంది.

తన స్థితిగతులు సంపూర్ణంగా అర్థం చేసుకొని సానుభూతితో నడచుకొంటుంది. ఆమె సానుభూతివల్ల కలిగే మనఃస్థైర్యంతోనే అతడు సంసారయాత్ర సాగిస్తున్నాడు. డబ్బు ఉన్నప్పుడు వీలైనంత వరకు ఆమె కోరికలు మాటల సందర్భంలో కనిపెట్టి తీరుస్తూనే వుండేవాడు. కాని ఇటీవల మనిషి ఆర్థికంగా చాలా ఇరుకున బడ్డాడు. ఈ పరిస్థితుల్లోనే ఎన్నడూ ఏమీ అడగని భార్య పసిపిల్లలకు పండుగ గుడ్డలు తెమ్మని కోరింది. ఆతని కడుపులో చుమ్మలు చుట్టుకొన్నట్లు బాధపడ్డాడు. ఆ బాధతో వెంటనే ఏమీ జవాబు చెప్పలేక నిలబడి పోయాడు.

ఆమె "ఏమండీ! మాట్లాడరేం?" అన్నది.




అతడు కొంచెం తేరుకొని "ఏమిటీ" అన్నాడు.

"ఏమిటేమిటి? నేను అడిగింది వినబడలేదూ?"

"వినబడింది" అన్నాడు నీరసంగా.

"మరి-జవాబు చెప్పరేం?"

"ఏముంది చెప్పడానికి. నీకు తెలియక పోతేగా"

అడ్వాన్సుల జాబితా అంతా ఖాళీ అయింది. వాటి తాలూకు మినహాయింపులతో అర్థజీతంకూడా చేతికి రావడంలేదు."

"కరువు భత్యము పెంచారు గదండీ?"

"పిచ్చిదానా! పేపరులో పడగానే చేతులో పడుతుందనుకొన్నావా? చాలా తంతు జరగాలి.

"ఎప్పటికైనా వస్తుంది గదా?"

"ఆ రావచ్చు."

"అయితే ఒక పని చేయండి. మా అన్నయ్యకు రాసి రు 150-లు తెప్పించండి. కరువుభత్యమూ ఇంక్రిమెంటు జీతమూ రాగానే ఇచ్చేద్దాం"

ఈ ఆలోచన రాఘవరావుకు నచ్చింది. తన పెద్ద బావమరది కృష్ణా జిల్లాలో డిప్యూటీ తహసీల్దారుగా పని చేస్తున్నాడు. వాళ్ళిద్దరు హైస్కూలు చదువులనాటి నుంచీ మంచి స్నేహితులు. వారి స్నేహమే బంధుత్వానికి కూడా దారితీసింది. పైగా వరసమాట కాదనడు.

"మంచిది. నీఆలోచన ఒకరకంగా బాగానే ఉన్నది"

"అయితే ఈ వేళే అన్నయ్యకు రాయండి"

"నేను రాయను. నీ వే రా యి" అన్నాడు.

ఆరోజే రుక్మిణమ్మ వాళ్ళ అన్నయ్యకు ఉత్తరం రాసిపడేసింది.

## 2

వారం గడిచిందో లేదో అప్పుడే మనియార్డరు వచ్చింది. వాళ్ళ అన్నయ్య ఎంత ఆపేక్షకలవాడు! తన కెన్ని అవసరాలున్నాయో అవన్నీ పక్కకునెట్టి సమయానికి చేతులో డబ్బుందో, లేదో. ఏమో! ఎన్ని తంటాలు పడ్డాడో. వెంటనే మనియార్డరు పంపించాడు. ఇక పిల్లలకే కాకుండా తనకొక మంచిచీర - దాని మీదకు మంచి రవిక - తన భర్తకు ఒక బుష్ షర్టు - ఒక పాంటు - ఇంకా తువాళ్ళు వగైరా కొనుక్కోవచ్చు. ఆమె మనసులో ఉన్న బరువు దించినట్లయింది. సంతోషంతో పొంగిపోయింది. ఎప్పుడు భర్త యింటికి వస్తాడా అని సాయంకాలం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నది.

ఆరుగంటలకు రాఘవరావు ఇంటికి వచ్చాడు. రాగానే కాళ్ళూ చేతులూ మొహమూ కడుక్కోడానికి నీళ్ళు నబ్బుబిళ్ళ, తుండుగుడ్డ ఇచ్చింది. తరువాత మంచినీళ్ళూ, ఫలహారమూ టీ తెచ్చి ముసిముసి నవ్వుతో ముందర నిలబడ్డది. ఆమెవైపు ఖరి కనిపెట్టి అతడు

"ఏమో హుషారుగా ఉన్నావే!" అన్నాడు.

"ఈవేళ మా అన్నయ్య పంపిన మనియార్డరు వచ్చింది. మీరు ఆఫీసుకు వెళ్ళిన తరువాత పోస్టుమన్ పట్టుకొని వచ్చాడు."

"ఓహో!"

"మిమ్మల్ని రేపు పొద్దున పోస్టాఫీసుకు వచ్చి తీసుకోమన్నాడు."

రాఘవరావు మనస్సుకూడా మనియార్డరు వచ్చిందనగానే కొంచెం తేలిక పడ్డది. కాని దానికై పనికట్టుకొని రేపు పోవాలంటే సెలవుపెట్ట వలసిందే. ఆఫీసులో ఉండగానే యీ సంగతి తెలిసినట్లయితే సెలవుకాగితం చేతికిచ్చి మేనేజరుగారితో చెప్పుకొని వచ్చి ఉండేవాడు. తీరా యింటికి వచ్చిన తరువాత యీ అవసరం ... గింది. వాళ్ళు కాపురం ఉన్నది నాంపల్లిగుండు. తన ఆఫీసు బేగమ్ పేట. సెలవు కాగితం తీసికొనిపోయే తోటి గుమాస్తాలు ఎవ్వరూ దగ్గరలో లేరు. సెలవు పెట్టితేనేగాని యీ పని అయ్యేటట్లు లేదు. ఎట్లాగా అని ఆలోచనలో పడ్డాడు.

"మనియార్డరు వచ్చినా మాట్లాడరేమండీ?"

"ఏమిచేయమంటావు? గంతులు వేయమంటావా?"

"బజారుపోయి గుడ్డలు తెచ్చుకొందాము."

"డబ్బు రానిదే!"

"ఇంటిదాకా వచ్చిన మనియార్డరు రాక ఎక్కడికి పోతుంది?"

"అయితే?"

"మీ స్నేహితుడి మామగారి కొట్లో పద్దు రాయించి తీసుకొందాము. రేపు పోస్టాఫీసునుంచి డబ్బు తీసికొని చెల్లువేయండి."

"ఏమంత తొందర? ఒక్కరోజులో ఏమి ముంచుకొని పోయింది?"

"ఆ తొందర మొగవాళ్ళకేం తెలుస్తుంది? నాకా యిబ్బంది రోజులు. ఈ రోజు తప్పితే మళ్ళీ నాకు తీరిక దొరకదు. పండుగ తాకిడికి పదిరోజులు ముందుగానే దర్జీచేత గుడ్డలు పట్టించి కుట్టించుకోవాలి. లేకపోతే పండుగకు కొత్త గుడ్డలందవు. పైగా పండుగకు ముందు బయటికి కదలడానికి నాకు తీరుబడి వుండదు."


రాఘవరావు మారు మాటాడలేకపోయాడు. తనకు ఆలోచన చెప్పి డబ్బు తెప్పించి ఎంతో ఉత్సాహంగా పండుగ చేసుకొందామని ఉవ్విళ్ళూరుతున్న భార్యను నిష్కారణంగా చిన్నబుచ్చడం ఇష్టంలేక పోయింది. వెంటనే వాళుభయులు పిల్లలను తీసికొని సికింద్రాబాదు వెళ్ళి కావలసిన గుడ్డలు మరికొన్ని వస్తువులు తీసికొని రాత్రి 8 గంటలకు ఇల్లు చేరారు.

## 3

రాఘవరావు మరునాడు ఉదయమే 8 గంటలకు ఇంట్లోనుంచి బయలుదేరాడు. అతను నామాలగుంటు నుంచి బేగమ్‌పేటలోవున్న ఆఫీసుకు వెళ్ళి సెలవు కాగితం ఇచ్చి సికింద్రాబాదు స్టేషను సమీపంలో రైల్వే ఆఫీసులకు పక్కన ఉన్న హిమ్మత్నగరు పోస్టాఫీసుకు వచ్చి పోస్టుమన్‌ను కలుసుకొని మనియార్డరు తీసుకొని ఇంటికి రావాలి. ఇంతదూరము బస్సుల్లో తిరగాలి. నిత్యం బస్సులో ఆఫీసుకు పోవడానికి సీజను టిక్కెట్టు ఉందికాబట్టి బస్సు చార్జీల ఖర్చు తప్పిందిగదా అనుకొన్నాడు.

ప్రయాణము చేస్తూండగా మధ్యదోవలో పారడైజుటాకీసు దగ్గర బస్సు ఆపి చెకింగు చేశారు. రాఘవరావు సీజను టిక్కెట్టు చూపించాడు. దాన్ని చూసి చెకింగు ఇన్‌స్పెక్టర్ "దీనితో ఇంకా ఎన్నాళ్ళు ప్రయాణం చేయాలని అనుకొంటున్నారు?" అని అడిగాడు.

రాఘవరావు నివ్వెరపోయాడు. ఇన్‌స్పెక్టర్ "సీజను టిక్కెట్టు" మీద ఉన్న గడువుతేదీ చూపించాడు. గడువు ముగిసి పదిరోజులైంది. రాఘవరావుకు ఆ సంగతి దృష్టిలోనే లేదు. పెనాల్టీతో



సహాడబ్బుకట్టిసీజనుటిక్కెటురెన్యూవల్ చేయించుకొనమని చెప్పి అతన్ని కిందికి దించేశాడు. అదృష్టవశాత్తు అతని జేబులో చిల్లర రెండు రూపాయల దాకా ఉన్నది. ఇంకొక బస్సు వచ్చేవరకు అక్కడే ఉండి టిక్కెటు కొనుక్కొని ఆఫీసుకు చేరాడు.

అప్పటికి పది గంటలయింది. అప్పుడే మేనేజరుగారు వచ్చారు. ఆయన ఈవేళ చాలా పెందలకడనే వచ్చారు కాబట్టి వెంటనే సెలవు కాగితము ఇచ్చి వెళ్ళవచ్చునని సంతోష పడ్డాడు. లోపలికివెళ్ళి ఆ మనకు నమస్కారంచేసి కాగితం చేతికిచ్చాడు.

మేనేజరుగారు కాగితాన్ని ఒకసారి పైనుంచి కిందికి చూశారు. తరువాత రాఘవరావు ని చూస్తూ....

"ఏమిటయ్యా! అంత మించిపోయే అర్జంటు పని?" అని అడిగాడు.

రాఘవరావు అసలు సంగతి చెప్పాడు.

"సరే! వెళ్ళుదువుగాని - ఇదిగో చూడు ఈ కాన్ఫిడెన్షల్ ఫైళ్ళలో గవర్నమెంటుకు పోవలసి అర్జంటు లెటర్స్, కొన్ని డి. ఓ. లు ఉన్నవి. మిషను తెప్పించుకొని నా ముందరే కూర్చొని అవి టైపు చేసి వెళ్లు" అన్నాడు.

గత్యంతరంలేక మారు మాట్లాడకుండా జవాను చేత పక్కనున్న బల్ల మీద మిషను పెట్టించుకొని కావలసిన కాగితాలు తీసికొని అవన్నీ కావలసిన తీరుగా టైపుచేసిపెట్టి మేనేజరుగారి సెలవుతీసుకొని బయలుదేరాడు. పావు గంటకుగాని బస్సురాలేదు. సికింద్రాబాదు స్టేషను దగ్గర బస్సు దిగి హిమ్మతు నగరు పోస్టు ఆఫీసుకు పరుగెత్తాడు.

# 4

అప్పటికే పోస్టుమనులందరూ ఎవరి టపాలు వారు సార్టు చేసుకొని రిజిష్టరు ఉత్తరాలు, మనియార్డరులు తీసుకొని బట్వాడా నిమిత్తం వారివారి డివిజన్లకు సైకిళ్ళమీద వెళ్ళిపోయారు. ఒక్కడుకూడా అక్కడ లేడు. ఎవరు దారిలోనో, తమ పేటలోనో తప్పకుండా పోస్టుమన్ కనపడగలడు. మించిపోయింది ఏమీలేదు. అని తనకు కలిగిన ఆశాభంగానికి తనకుతానే

ధైర్యం చెప్పుకొని తన బస్తీవైపు దారితీశాడు.

ఆ పోస్టుమన్ బీటు ఎక్కడి నుండి ఎక్కడి వరకో తనకు తెలియదు. ఇంకొకరిని అడిగితే మాత్రం వారికేం తెలుస్తుంది? వారందరు సైకిళ్ళమీద వెళ్లి నిముషాలమీద ఉత్తరాలు వగైరా ఇండ్లల్లో బట్వాడాచేసి ఒక వీధిలోంచి ఇంకో వీధిలోకి - మరో సందులోకి యింకా గొందులలోకి అదృశ్యమై ఎక్కడో మునిగి ఎక్కడో తేలి పనులు ముగించుకొని బయట పడతారు. వాళ్ళను వెంటాడి పట్టుకోవలెనంటే నలుగురైదుగురు కీలక స్థానాల్లో ఓపికతో కాపలా వేయాలి. పాపం! రాఘవరావు ఒక్కడు కాలినడకతో ఏం పట్టుకోగలుగుతాడు?

తన బస్తీచేరి వీధులలో ఒకరిద్దరు తెలిసిన వారిని పోస్టుమన్ గురించి అడిగాడు. కొందరు తమకు తెలియదన్నారు. కొందరు వచ్చి వెళ్ళాడన్నారు. అలా అడుగుతూ తిరిగి తిరిగి ఒక సందులోకి వచ్చేసరికి అతనికి ఆ సందుచివర సైకిలెక్కి బయలుదేరుతూ పోస్టుమన్ కనబడ్డాడు. కేకలు పెట్టుకొంటూ రాఘవరావు అతని వెంబడి పరుగెత్తడం సాగించాడు.

"పోస్టుమాన్! ఓ పోస్టుమాన్" అని అరుస్తూ పరుగెత్తి ఆ సందుచివర మలుపు తిరిగి చూశాడు. పోస్టుమన్ కనబడలేదు. మనిషి కనబడక పోయినప్పటికీ అతను ఎక్కడ ఉన్నదీ నిరారణగా తెలియక పోయినప్పటికీ అలాగే వెర్రికేకలు వేసుకొంటూ ఆ వీధి వెంబడే పరుగెత్తాడు. ఏమూల నుంచైనా "ఓయ్" అని పలుకుతాడేమో అని ఆశ.

ఒళ్లు చెమటలు పట్టిపోయింది. ఆయాసం వచ్చింది. ఆకలి మండిపోతూన్నది. అక్కడవున్న సందుల గొందులలో కూడా వెదికాడు. పోస్టుమన్ కనబడలేదు. అంతటితో అప్పటికి ఆశ వదలుకొని యింటికి వెళ్ళి భోజనంచేసి కొంత విశ్రాంతి తీసికొని మూడు గంటలకు మళ్ళీ పోస్టుమన్‌కోసం కాపలా వేసి పట్టుకొందామనుకొన్నాడు.





## 5

ఎండలో తిరిగి ఆకలితో భోజనం చేసిన తర్వాత కలిగిన ఆయాసంతో రాఘవరావు వెంటనే బయలు దేరలేక

పోయాడు. అదిగాక బట్వాడా పూర్తి చేసుకొని రెండు గంటలు కొట్టిన తర్వాతగాని పోస్టుమను లందరూ ఆఫీసుకు చేరరు. తాను మూడు గంటలకు పో చ్చుకొని మంచం మీద నడుం వాల్చాడు. వెంటనే మంచి నిద్రపట్టింది.

అతనికి మెలుకువ వచ్చేసరికి మూడు గంటలు దాటింది. పోస్టుమన్ ఆఫీసులో దొరకడేమో అన్న ఆదుర్దా కొద్దీ గబగబా కాళ్ళు చేతులు మొహమూ కడుక్కొని గుడ్డలు వేసుకొని పర్సు తీసుకొని బయలుదేరాడు. తాను బస్సు మీద వెళితే యింకా ఆలస్యమౌతుంది. సైకిలు మీద అయితే త్వరగా పోయి రావచ్చు. తనకైతే సైకిలులేదు. కాని పక్కనున్న వారింట్లో చూశాడు. దానికోసం ఆ యింట్లోకి వెళ్ళాడు. పెద్దవారెవరూ లేరు. సైకిలు మాత్రం పంచలోఉన్నది. బెల్లు, బ్రేకులు, మడ్ గార్డులు, క్యారేజి, స్టాండు, వగైరాలు ఏవీలేకుండా వంపులు సొంపులు లేని స్తంభాకారి, కర్కశగాత్ర అయిన పూర్వసువాసినీ దిగంబరి దేహాన్ని స్ఫురింప జేస్తూన్నది. దేహానికి మెత్తగా తగిలే భాగం ఎక్కడాలేదు. సీటుకున్న తోలుకూడా వాడుకలో లేని కారణాన లోహమైవున్నది. అదిఎట్లా ఉన్నా తన అవసరానికి దానినిప్పుడు వాడుకోవడం తప్పడంలేదు. అతనిని చూసి ఆ యింటివారి అబ్బాయి లోపలి నుంచి వాకిట్లోకి వచ్చాడు. ఆ అబ్బాయిని చూడగానే "ఏమోయ్! అర్జెంటు పనిమీద పోస్టాఫీసుకెళ్ళాలి. చాలా లేటయిందిప్పటికే. మీ సైకిలు తీసి కొనివెడుతున్నాను" అంటూనే సైకిలు తీసికొని వీధిలోకివచ్చి సైకిలెక్కాడు. ఆ అబ్బాయి ఏదో చెప్పబోయాడు. కానీ ఆ తొందరలో రాఘవరావు వినిపించుకోలేదు. అతడు కొంతదూరం పోయినాడు. త్రిశూలాల మధ్య పాతరవేసినట్లుగా ఉంది కాని సైకిలు సీటుమీద కూర్చున్నట్లు లేదు. పైగా చక్రాలలో చాలినంత గాలిలేదు. వాటి అంచులు తారు రోడ్డుకి ఆనుకొని మధ్య మధ్య గుంటలలో గతుక్కుమన్నప్పుడల్లా త్రిశూలాలు బ్రహ్మరంధ్రం దాకా పొడుచుకుంటున్నాయి. అంతబాధను ఓర్చుకొని శరీరమంతా ముచ్చెమటలు పోయగా మెయిన్‌రోడ్డు చేరుకొని సైకిలు షాపులో గాలి కొట్టించు కొన్నాడు. ఎంత కొట్టినా వెనక చక్రంలో గాలి నిలవడంలేదు. తానెంత తొందర పడుతూంటే అంత ఆలస్య మవుతున్నది. కారణమేమిటో చూస్తే దాని వాల్వుట్యూబు రెండు ముక్కలు కావడానికి సిద్ధంగాఉన్నది. దానిని తీసేసి కొత్తది వేయించి గాలి కొట్టించుకొని మళ్ళీ వెనక్కు తిరిగి చూడకుండా రయ్‌మంటూ వెళ్ళాడు. అతనిదృష్టి యావత్తు పోస్టుమను మీదనే ఉన్నది. అందీపాటికి బట్వాడా చేయని మనిఆర్డర్లు రిజిస్టరు ఉత్తరాలు ఆఫీసులో అప్పగించి ఇం




టికి వెళ్ళిపోయి ఉంటాడేమో. త్వరగా వెళ్ళాలి - అతణ్ణి యీ పూటైనా పట్టుకోవాలి.

రైలు వంతెన దగ్గరకు రాగానే నలుగురు కార్పొరేషను ఉద్యోగులు ఇద్దరు పోలీసులు రాఘవరావు అద్దెకొని సైకిలు పట్టుకున్నారు. ఆ సైకిలుకు లైసెన్సులేదు. లైసెన్సుఫీజు చెల్లించి సైకిలు తీసికొని వెళ్ళమన్నారు. ఆ సైకిలు తనదికాదని అర్జంటుపనిమీదపక్కింటివాళ్ళ సైకిలు తీసుకుని వచ్చానని తనగోడు చాలా సేపు చెప్పుకొన్నాడు.

అప్పటికి సాయంకాలం నాలుగు గంటలు దాటిపోయింది. తనకు కావలసిన పోస్టుమను ఆఫీసు వదలి ఎప్పుడో వెళ్ళిపోయి ఉంటాడు. తన పని యీ రోజుకు పాడయినట్లె - కాని యీసైకిలుమూలాన దారినబోయే శనేశ్వరాన్ని తన నెత్తిన వేసుకున్నట్లయింది. అతడు కొయ్యబారి అట్లాగే నిలబడ్డాడు. కొంతసేపటికి ఒకఆలోచన తోచి పర్సుతీసి చూసుకుంటే ఒక ఐదు రూపాయలనోటు ఉన్నది. వెంటనే ధైర్యం వచ్చింది. లైసెన్సు ఫీజు చెల్లిస్తాను. సైకిలు వదలిపెట్టండి అన్నాడు. వాళ్లు దానికి సరేఅని వెనకటి లైసెన్సు ఫీజు తాలూకు బిళ్ళ

చూపించమని కోరాను. దానినిఎప్పుడు చెల్లిచారో తనకు తెలియదన్నాడు. అప్పుడు వాళ్ళు అన్నారు గదా-

మీకు తెలియకపోతే దీని సొంత దారుని కనుక్కొని అప్పటి నుంచి యిప్పటివరకూ అయిన బకాయీలే వైనా ఉంటే వాటితోసహా యీ అర్ధ సంవత్సరం ఆఖరువరకు బేబాకీగా చెల్లిసేనేగాని సైకిలు స్వాధీనం చేయం.

ఈ మాటలు విని రాఘవరావు చతికిల బడ్డాడు. అటువంటి బకాయీ లంటూ వుంటే ఈ సైకిలు ఖరీదును మించుతాయేమో! ఆ సైకిలు స్వంతగా డైతే యీ బకాయీలు చెల్లించేబదులు సైకిలే వదలుకునే వాడేమో! లేని పోనిది తాను పోయి చిక్కులో యిరుక్కున్నాడే! ఏమిపీడ పట్టుకొన్నది కరువురోజుల్లో అన్యాయంగా ఉత్త పుణ్యానికి దండగ పెట్టుకోవడమే కాకుండ తానుమాటలుకూడా పడవలసి వస్తుంది. హరి! భగవంతుడా! ఏమి దారుణమురా! చేసేది ఏమీలేక చేతిలో ఉన్న సైకిలుపోయి చెవులు యూడించుకుంటూ గోడుమంటూ రాత్రికి యిల్లు చేరుకున్నాడు.

రాఘవరావు మనస్సులో నిరుత్సాహం ఏర్పడింది. ఆఫీసుకి వెళ్ళి పని చేయడానికి బుద్ధి పుట్టలేదు. మూడు రోజులకు సెలవు రాసి పోస్టులో వేశాడు. ఆ సైకిలు గొడవ తన్నుదెయ్యంలాగా పీకుతున్నది. పక్కింటి ఆయన సతాయింపు జాస్తి అయింది. ఆయనకు లైసెన్సు ఫీజు కట్టడం యిష్టం లేక దాన్ని బయట పెట్టకుండా వాడుకుంటున్నాడు. ఇప్పుడు దానిని బయటపెట్టి దాని బకాయీలన్నీ నెత్తిన వేసుకున్నాడు. ఆ మొత్తమంతా చెల్లించి సైకిల్ను ఇంటికి తీసికొని వచ్చి ఆ పొరుగింటిపోరు వదిలించుకోవాలి. ఆ యింటిలో పెద్ద వాళ్ళను అడక్కుండా వాళ్ళ పిల్లాడు చెప్పబోయేదివినిపించుకోకుండా సైకిలు తీసికొని వెళ్ళినందుకు తనకు బాగా శాస్తి అయింది. ఆ సెలవు మూడు రోజులూ కార్పొరేషను చుట్టూ తిరిగి చెల్లించవలసిన మొత్తాన్ని తేల్చుకొన్నాడు. డబ్బు చెల్లించటానికి ముందుగా తను మనియార్డరు తీసికోవాలి. డబ్బుచేతిలో పడితే అన్ని సంకటాలు నివారణ అవుతవి. మరునాడు ఉదయమే పెందలకడనే పోస్టాఫీసుకి వెళ్ళాడు. తన పేటకు వచ్చే పోస్టుమనుకోసం వెదికాడు. కాని అతడు కనబడలేదు. తక్కినవాళ్ళంతా టపాలు తీసికొని బట్వాడా నిమిత్తం ఊళ్ళోకి బయలుదేరారు. కాని తనకు కావలసిన మనిషి దొరకలేదు. ఎంక్వయిరీ దగ్గిర విచారిస్తే నామాలగుండ బీటు పోస్టుమను టపాలు తీసికొని వెళ్ళి

పోయినట్లు తెలిసింది. రాఘవరావు నిర్ఘాంతపోయి నిల్చున్నాడు. ఎక్కడికిపోయినా పొద్దు ఎదురవుతున్నది.

అంతట్లో తాను వెదుకుతూఉన్న పోస్టుమన్ బే డ్రెస్సులో అక్కడికి వచ్చాడు. రాఘవరావు పరుగెత్తుకొంటూ వెళ్ళి తన మనియార్డరు సంగతి అడిగాడు.


"నాకు సెలవుమంజూరై వచ్చింది. నిన్న సాయంకాలమే చార్జియిచ్చాను. నాకు బదులు వచ్చిన అతణ్ణి అడగండి" అని జవాబు చెప్పాడు.

"ఈ సాయంకాలం వచ్చి అడగనా?"

"మూడు గంటలకు రండి. అప్పుడతను బీటు నుంచి తిరిగి వస్తాడు."

కాళ్ళీడ్చుకొంటూ రాఘవరావు ఇంటికి చేరాడు. భోజనం సహించలేదు. కొంచెం విశ్రాంతి తీసుకొని మళ్ళీ ఆలస్యంచేస్తే ఏమి మూడుతుందోనని వెంటనే బయలుదేరి పోస్టు ఆఫీసుకు కాలినడకనే చేరుకున్నాడు. దాని ముందర రోడ్డుమీద కాపలావేసి వచ్చే పోస్టుమన్‌లందరిలో ప్రతివాడినీ నామాలగుండు బీటు నీదేనా అని అడుగుతూ నిలబడ్డాడు.

గంటన్నరయిన తర్వాత నామాలగుండు ఆయన వచ్చాడు. వెంటనే వెళ్ళి తన మనియార్డరు సంగతి అడిగాడు.




"మీరు రాఘవరావుగారవునో కాదో నాకు తెలియదు. మీ కిక్కడ తెలిసినవారున్నారా? ఐడింటిఫికేషను సంతకం చేసే వాళ్ళుంటేనేగాని మీకు మనియార్డరు ఇవ్వడానికి వీల్లేదు" అన్నాడతడు.

రాఘవరావు అంతటా వెదికాడు. తనకటువంటి సంతకం చేయగల వాళ్ళు ఎవ్వరూ కనబడలేదు. ఆ పాత పోస్టుమన్ వచ్చినా బాగుండును అనుకొన్నాడు. కాని సెలవుమీద పోయినవాడు ఎందుకు వస్తాడు! అతనికి ఏమీ తోచడంలేదు. తన వ్యవహారంపోయిన పొద్దుగునా పేచీగానే ఉంది. ఇతని వాలకంచూసి ఆ పోస్టుమన్ చిన్న సలహా చెప్పాడు.

"రేపు పొద్దున్నే మీ మీ పేటలో ఉన్న కోటయ్యగారిని తీసుకొని ఇక్కడికి రండి. వారు మీ మనియార్డరు

ఫారం మీద ఐడింటిఫికేషను సంతకం చేస్తే డబ్బిస్తాను"

అదృష్టవశాత్తు రాఘవరావుకు కోటయ్యనాయుడుగారితో కొంచెం పరిచయం ఏర్పడి ఉన్నది. అందుకని ధైర్యంగా ఇంటికి వచ్చాడు.

నాయుడుగారిని బతిమలాడి 'కారులో ఎక్కించుకొని మరునాడు ఉదయమే రాఘవరావు పోస్టు ఆఫీసుకు చేరుకొన్నాడు. అమ్మయ్య! ఇన్నాళ్ళకు మనియార్డరు చేతిలో పడబోతూన్నది. లక్ష్మీదేవి కటాక్షించింది. అతనుపడ్డ బాధలన్నీ మరచిపోయాడు. జగమంతా ఆనందమయమనిపించింది.

రాఘవరావును కిటికీ దగ్గర చూడగానే పోస్టుమన్ మనియార్డరు ఫారం తీసికొని వచ్చాడు. సంతకాలు కాగానే 15 నయాపైసలు తీసి రాఘవరావు చేతిలో పెట్టాడు.

"15 నయాపైసలా? ఏమిటి? 150 రూపాయలు!" అన్నాడు గుడ్లు తేలవేస్తూ నోరుతెరచి —

"ఇదిగో! ఈ మనియార్డరు ఫారం మీద ఉన్న డబ్బు మొత్తం చూచుకోండి" అన్నాడు పోస్టుమన్.

తన కాళ్ళకింద భూమి కుంగిపోతున్నట్లు తోచింది. తల తిరిగిపోతున్నది. కొంచెం తెప్పరిల్లుకొని మనియార్డరు కూపను అందుకొని దానిమీది వ్రాత చదువుకొన్నాడు. అది గుంటూరు ఎ. పి. ఆర్. టి. సి. బస్సు డిపోనుంచి వచ్చింది.

"అయ్యా! గత సంవత్సరం మీ దగ్గర పోర్టబుల్ టైపురైటరు లగేజి క్రింద 30 పైసలు అదనంగా వసూలు చేసినందుకు మీ పిటీషనుమీద విచారణ జరిపి దానిని వాపసు చేయడానికి మంజూరు పొంది మనియార్డరు కమీషను మినహాయించి మిగిలిన 15 పైసలు మీకు ఇందుతో పంపడమైనది. ఈ మొత్తము ముట్టినట్లు పేరే రశీదు రాసి వెంటనే హెడ్ ఆఫీసువారికి పంపేది."

రాఘవరావుకు పిచ్చెత్తినట్లయింది. ఆ పిచ్చిలోనే రశీదు రాసి ఆ 15 పైసలతో కవరు కొని దానిలో రశీదు పెట్టి అడ్రసు రాసి అప్పుడే పోస్టులో వేశాడు.

***

## రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పి పంపగోరితే రచనతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతోపాటు కాక తరువాత స్టాంపులు పంపరాదని, అట్టివారికి రచనలు త్రిప్పిపంపడం కష్టసాధ్యమని గుర్తించాలని మా విజ్ఞప్తి.